PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 03 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 05 రూ - 03/- బుధవారం 01 జనవరి 2025

## పులుల సంచారంతో గ్రామీణ ప్రాంతంలో భయాందోళనలు




## కిమ్స్‌లో బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన మంత్రి సీతక్క




# సమిష్టి కృషితో వికసిత భారత్

**●కొత్త సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా మోడీ**



**న్యూఢిల్లీ,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశిస్తూ.. పోస్టు పెట్టారు. ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను గురించి వివరిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు. 'సమష్టిగా ప్రయాత్నించి.. 2024లో అనేక విజయాలు అందుకున్నాం. 2025లో మరింత కష్టపడి పనిచేసి వికసిత్ భారత్ కలను సాకారం చేసుకుందాం' అని మోదీ పేర్కొన్నారు. దీనితో పాటు ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. ఈ వీడియో ఒక ఏడాది కాలంలో సాధించిన పురోగతి, ఐక్యత, వికసిత్ భారత్ వైపు వేసిన అడుగులను గుర్తుచేస్తుందన్నారు.

# 4న తెలంగాణ కేబినేట్ భేటీ



**●రైతు భరోసా, పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులపై చర్చ ●యాదగిరిగుట్ట బోర్డు నియామకంపైనా చర్చకు అవకాశం ●సిఎం రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో భేటీ**

**హైదరాబాద్, 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో

వివరాలు 2లో

# భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు



**హైదరాబాద్,31 (పిసిడబ్ల్యూ న్యూస్):** న్యూ ఇయర్ వేళ రాష్ట్రంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. నిన్న ఒక్కరోజే మద్యం అమ్మకాల ద్వారా రూ. 402 కోట్ల 62 లక్షల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరింది. డిసెంబర్ 31 నేపథ్యంలో నిన్నటి నుంచే బెవరేజ్ శాఖ నుంచి భారీగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే మద్యం దుకాణాలకు భారీగా లిక్కర్ చేరింది. నిన్న 3,82,265 కేసుల లిక్కర్, 3,96,114 కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇవాళ లిక్కర్ అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది. **అర్ధరాత్రి వరకు మద్యం షాపులు ఓపెన్...** డిసెంబర్ 31న వైన్స్ షాపులు సమయ వేళలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్ధరాత్రి వరకు వైన్ షాపులు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే బార్‌లు, రెస్టారెంట్‌లు కూడా తెల్లవారు జామున 1:00 గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. ఈ మార్పులను ధృవీకరిస్తూ ఎక్సైజ్ శాఖ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# ఫార్ములా-ఈ రేసు కేసులో ముగిసిన విచారణ



**●తీర్పు ఇచ్చే వరకు కెటిఆర్‌ను అరెస్ట్ చేయొద్దు ●మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు**

**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్ములా–ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా .. ఈనెల 30 వరకు అరెస్టు చేయొద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఆ తర్వాత విచారణ 31కి వాయిదా పడింది. తాజాగా ఇరు వైపులా వాదనలు ముగియగా.. కేటీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది. తీర్పు ఇచ్చే వరకు అరెస్టు చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా – ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు

వివరాలు 2లో

# ఏటా ఫీజుల పెంపుతో విద్యార్థులపై భారం

**●ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం అజమాయిషీ**
**●విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి**



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ ప్రభుత్వం నియంత్రిస్తుందని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రతి ఏడాది ఫీజు పెంచులను కోవడం సమంజసం కాదన్నారు. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలని, ప్రభుత్వానికి తాము సిఫార్సు చేస్తున్నామని తెలిపారు. పిర్యాదులు స్వీకరణ పరిష్కారం కోసం అధికారాలతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు. మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదని ఆకునూరి మురళీ పేర్కొన్నారు. 'ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ ప్రభుత్వం నియంత్రిస్తుంది. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలి. ఈ విషయమై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాం. ప్రైవేట్ విద్యా సంస్థలను స్ట్రీమ్ లైన్ చేయాలని

వివరాలు 2లో

# భగీరథమ్మ చెరువులో ఆక్రమణల కూల్చివేత

**●ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా**



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ ఖాజాగూడ భగీరథమ్మ చెరువులోని అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. బఫర్ జోన్ లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కుల్చివేస్తున్నారు ఖాజాగూడా భగీరథమ్మ చెరువు ఆక్రమమణలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఇటీవలే భగీరథమ్మ చెరువులోని ఆక్రమణలను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. ఈ క్రమంలో డిసెంబర్ 31న బఫర్ జోన్ లో ఏర్పాటు చేసిన షెడ్ లు,ఆక్రమణలను కూల్చివేసింది.నాలుగు ఎకరాల్లో ఆక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారు. 20కి పైగా దుకాణాలను తొలగించారు. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే దుకాణాలను ఎలా ఖాళీ చేయాలంటూ వ్యాపారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖశాంతులతో జీవించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కాల ప్రవాహంలో ఎదురొచ్చే మంచి చెడులు, కష్ట సుఖాలను సమానంగా స్వీకరించే స్థితప్రజ్ఞతను అలవర్చుకుంటూ ఆశావహ దృక్పథంతో తమ జీవితాలను చకదిద్దుకోవాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పులు సాధించడం ద్వారానే పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

# పట్నం నరేందర్‌రెడ్డికి నోటీసులు




# రవాణా శాఖలో సంస్కరణలు తెచ్చాం

**●ఈవీ, స్క్రాప్ పాలసీల అమలు**
**●ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా సాధికారత**
**●రూ.4,225 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం రికార్డు**
**●మంత్రి పొన్నం ప్రభాకర్**



# ల్యాబ్‌లో పనిచేస్తున్న ఉద్యోగిపై కత్తితో దాడి

**పెద్దపల్లి, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో ఘోరం జరిగింది. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఓ గుర్తు తెలియని వ్యక్తి కత్తులు, తల్వార్‌లతో రెచ్చిపోయాడు. కంప్యూటర్ ల్యాబ్‌లో పని చేస్తున్న ఉద్యోగిపై కత్తి, తల్వార్‌తో విచక్షణారహితంగా దాడి చేశాడు. విద్యార్థులు చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. భయంతో విద్యార్థులు పరుగులు పెట్టారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఉద్యోగిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాధితుడిని శ్రీనివాస్‌గా గుర్తించారు. శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# పట్నం నరేందర్‌రెడ్డికి నోటీసులు



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బొంరాస్‌పేట పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ నేత శేఖర్‌పై రోటిబండ తండావాసులు దాడి చేసిన ఘటనలో జనవరి 2న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే రోటిబండ తండా ఘటనలో పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టు షరతులతో కూడి బెయిల్ ఇచ్చింది. అయితే బెయిల్‌పై ఉండి కూడా షరతులను ఉల్లంఘిస్తూ ప్రెస్ మీట్ పెట్టారని బొంరాస్‌పేట పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎల్లుండి విచారణకు రావాలని మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు పంపించారు.

# ఫార్ములా-ఈ రేసు కేసులో ముగిసిన విచారణ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం అడిగింది. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

# ఏటా ఫీజుల పెంపుతో విద్యార్థులపై భారం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసంబద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక స్కూల్లో అప్లికేషన్ ఫీజు రూ.4,500గా ఉంది. స్కూల్స్ సేల్స్ యాక్టివిటీ నుండి పూర్తిగా బయటకు రావాలి. ప్రభుత్వం ఆ వైపున చర్యలు తీసుకుంటుంది. పిర్యాదులు స్వీకరణ పరిష్కారం కోసం అధికారాలతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలి' అని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. 'మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో కొన్ని మంచి అంశాలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఫీజు పెంచుకోవాలని అనుకోవడం సమంజసం కాదు. స్కూల్లోకి ఎఫ్డీఐలు కూడా వస్తున్నాయి. కేంద్రనికి లేక రాస్తాము. స్కూల్లను కేటగిరీలుగా విభజిస్తాం. ఒక వారంలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తాము' అని విద్యా కమిషన్ ఛైర్మన్ తెలిపారు.



# 4న తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు. కొత్త ఏడాది కానుకగా తెలంగాణ ప్రభుత్వం పలు హామీల అమలుకు సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. అందులో భాగంగా జనవరి 4న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సెక్రటేరియట్ లో సాయంత్రం 4 గంటలకు ఈ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. కేబినెట్ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, బీసీ రిజర్వేషన్ లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల సాయం మొదలైన అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే రైతు భరోసా, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అసెంబ్లీలో చర్చించిన విషయం తెలిసిందే. సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇటీవల ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సబ్ కేబినెట్ భేటీ జరిగింది. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, భూభారతి, నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం తదితర అంశాలపై ఉపసంఘం సమావేశంలో చర్చించారు. మంత్రి వర్గ ఉపసంఘంలో చర్చించిన అంశాలను కేబినెట్ కు సిఫారసు చేశారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సబ్ కేబినెట్ లో చర్చించిన అంశాలను అభిప్రా యాలను జనవరి 4న జరగబోయే కేబినెట్ పరిగణనలోకి తీసుకోనుంది. ఉపసంఘం సిఫారసుల ఆదారంగా చర్చించి ఈ అంశాలపై నిర్ణయం తీసుకోనున్నారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పేందుకు మరికొన్ని పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. జనవరి నాలుగున రాష్ట్ర ప్రజలకు దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయనుంది .

# పులల సంచారంతో గ్రామీణ ప్రాంతంలో భయాందోళనలు

**నిర్మల్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని కాల్వ లక్ష్మీనర సింహ స్వామి ఆలయం సమీపంలో నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై వాహనదారులకు చిరుతపులి కనిపించింది. దీంతో తమ సెల్‌ఫోన్లలో చిరుతను బంధించారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. కాగా, చిరుత సంచారంతో సమీపంలోని గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.



### ఉమ్మడి ఆదిలాబాద్‌ను వణికిస్తున్న పులులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పులులు వణికిస్తున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్-మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో గతంలో ఉన్న రెండు పులులు కాస్తా.. 11కు పెరగడంతో ఇదిగో పులి.. అదిగో టైగర్ అన్న హెచ్చరికలతో స్థానికులు జంకుతున్నారు. పులుల భయంతో రోజువారీ పనులకు వెళ్లేందుకు అటవీ సమీప గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. తాజాగా ఎర్రగుంట గ్రామశివారులో అటవీ అధికారులు పులి కదలికలను గుర్తించారు. మంచిర్యాల జిల్లా ముల్కల్లబీట్ పరిధిలోనూ మరో ఆడపులి సంచారాన్ని కనిపెట్టారు. ఇక్కడే మరో ఆడపులి ట్రాప్‌కెమెరాకు చిక్కింది. ఇదే ఏరియాలో మరో మగపులి సంచరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మందమర్రి, అందుగులపేట, తాండూరు మండలం నీలాయిపల్లి సమీపంలో పులి సంచారం కలకలం రేపుతోంది. బొంబాయిగూడ గ్రామ శివారులోని ఉచ్చమల్లవాగుతోపాటు సమీప పంటచేలల్లో మేకలకాపరులు పులి పాదముద్రలను చూసినట్టు తెలిపారు. పులల సంచారంతో అలర్ట్ అయిన అటవీశాఖ అధికారులు గ్రామాల్లో చాటింపు వేయిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

- రైతులను రాబందుల్లా దోపిడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని వర్గాలను నట్టేట ముంచుతుందని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయకపోగా కాంగ్రెస్ రాబందులు ఉల్టా రైతులనే దోపిడీ చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. జోగులాంబ జిల్లా ఐజ మండలంలో ఆర్డీఎస్ కెనాల్ కింద పండించిన వరి ధాన్యాన్ని గవర్నమెంట్ ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. చాలా చోట్ల మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్ల అకౌంట్‌ను తమ గుప్పిట్లో పెట్టుకొని ఇదే అదనుగా ఐకేపీ సెంటర్ల దగ్గర కాంగ్రెస్ నాయకులు రైతులను పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు. క్వింటాల్‌కు నాలుగు కిలోల చొప్పున తక్కువ తూకం వేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఒక ఎకరం 30 క్వింటాలు దిగుబడి వస్తుంది.. కావున క్వింటాల్‌కి నాలుగు కిలోల చొప్పున తీసివేస్తే ఒక ఎకరం మీద రైతు రూ. 3500లు నష్టపోతున్నారు. మళ్లీ హమాలీ పేరిట క్వింటాల్ చొప్పున రూ. 46 వసూలు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారం సగటున ఒక ఎకరానికి ఐకేపీ సెంటర్ల ద్వారా గవర్నమెంట్‌కి విక్రయిస్తే రూ. 4880లు రైతులు నష్టపోతున్నామని ఇక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. కేసీఆర్ గవర్నమెంట్‌లో ఎకరాకు పెట్టుబడి సహాయంగా రూ. 5000 అందజేస్తే రేవంత్ రెడ్డి గవర్నమెంట్‌లో ఉల్టా ఎకరాకు రూ. 4880 నష్టపోతున్నారు. మొత్తం రైతుల నుండి దోచుకున్న సొమ్ము ఎకరాకు దాదాపు పదివేల రూపాయలన్న మాట! ఇట్ల గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణ రైతులను ఇంకా ఎన్ని చోట్ల దోచుకుంటున్నారో ఈ కాంగ్రెసు కేడీలు! ఒక కన్నేసి ఉంచండి. రైతన్నలారా, తస్మాత్ జాగ్రత్త!! అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

# కొత్త సంవత్సరం రోజున కెటిఆర్‌ను బాధ పెట్టవద్దు:మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఫార్ములా ఈ-కార్ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెట్టుకున్న క్వాష్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారించింది. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. తీర్పు ఇచ్చేంత వరకు కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ కొత్త సంవత్సరం రోజున కేటీఆర్ ను బాధ పెట్టవద్దని ఎద్దేవా చేశారు. న్యూ ఇయర్ ను ఎంజాయ్ చేయనివ్వాలని చెప్పారు.ఒక రెండు రోజులు ఎంజాయ్ చేయనిద్దామని, జనవరి 3, 4 తేదీల్లో కేటీఆర్ గురించి చూద్దామని వ్యాఖ్యానించారు. నల్గొండ జిల్లా ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ అని కోమటిరెడ్డి చెప్పారు. 4 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్ నీరు ఇస్తుందని అన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పని చేయరని, కాంట్రాక్టర్లు పని చేయకపోతే మంత్రికి చెప్పాలని సూచించారు. అధికారులు సీరియస్ గా పని చేస్తే ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేయవచ్చని చెప్పారు. ఎస్ఎల్బీసీ ఒక వరల్ వండర్ అని, ఇది పూర్తయితే ప్రపంచమంతా వచ్చి చూస్తుందన్నారు.

# జనవరి 2 నుంచి టెట్ పరీక్షలు

**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజి టెట్) 2024 పరీక్షలు గురువారం(జనవరి 2) నుంచి ప్రారంభం కానున్నాయి. 17 జిల్లాల్లో 92 పరీక్షా కేంద్రాలలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో టెట్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి పది రోజుల పాటు 20 సెషన్లలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు టిజి టెట్ చైర్మన్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవిఎన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు రెండో సెషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు తొలి సెషన్‌కు ఉదయం 7.30 గంటలకు, రెండో సెషన్‌కు 12.30 గంటలకు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రెండోసారి నిర్వహిస్తున్న టెట్ పరీక్షకు మొత్తం 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్ 1కు 94,327 దరఖాస్తులు రాగా, పేపర్ 2కు 1,81,426 దరఖాస్తులు వచ్చాయి. ఏమైనా సమస్యలు ఉంటే అభ్యర్థులు 7032901383, 9000756178,7075088812, 7075 028881, 7075028882, 7075028885 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# కిమ్స్‌లో బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంధ్యా థియేటర్ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క మంగళవారం పరామర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీతో కలిసి కిమ్స్ ఆసుపత్రిని ఆమె సందర్శించి శ్రీతేజ్ కి చికిత్స అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి శ్రీ తేజ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని చూసి భావోద్వేగానికి లోనైనా మంత్రి సీతక్క శ్రీతేజ్ తండ్రికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క సినిమా రిలీజ్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగుపడిందని,వెంటిలేటర్ చికిత్స నుంచి శ్రీతేజ్ బయటకి వచ్చాడని అన్నారు. శ్రీతేజ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించి శ్రీతేజ్ కు అందుతున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని బయటికి రావాలని కోరుకుంటున్నామని అన్నారు. డాక్టర్లు స్పెషల్ కేర్ తీసుకొని మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించామని తెలిపారు. శ్రీతేజ్ సంతోషంగా బయటికి వస్తాడు అన్న నమ్మకం ఉందని అన్నారు. శ్రీ తేజ్ ప్రాణాలను కాపాడేందుకు ఇటు ప్రభుత్వంచ, అటు డాక్టర్లు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుంటాడన్న ఆశతో ఉన్నామని పేర్కొన్నారు.

# రవాణా శాఖలో సంస్కరణలు తెచ్చాం

- ఈవీ, స్క్రాప్ పాలసీల అమలు
- ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా సాధికారత
- రూ.4,225 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం రికార్డు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రవాణా శాఖ 2024లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి, అన్ని రంగాల్లో విజయం సాధించినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈవీ పాలసీ అమలుతో ఇప్పటి వరకు 8,497 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఏటా సగటున 5 లక్షల వాహనాలు చేరడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. రిజిస్టర్డ్ వెహికల్స్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్, ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్ అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారుల 4,577 డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేసినట్టు తెలిపారు. ఉచిత బస్సు పథకంలో ఇప్పటి వరకు 125.50 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.4,225 కోట్ల రవాణా ఖర్చులను ఆదా చేసుకున్నట్టు వెల్లడించారు. ఏడాదిలో 1,389 కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చినట్టు మంత్రి తెలిపారు. 113 ఏఎంవీఐ ఉద్యోగాల్లో 97 మందికి, టీఎస్ఎల్‌పీఆర్‌బీ ద్వారా 63 ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 54 మందికి నియామకపత్రాలు అందించినట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 8,04,255 వాహనాలు టీజీలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు.

### నేటి నుంచి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

జనవరి 1 నుంచి 31వరకు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రవాణాశాఖ, ఆర్టీసీ అధికారులతో మంగళవారం జూమ్ యాప్ ద్వారా సమావేశమయ్యారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీలు, ట్రైనింగ్ క్లాస్‌లు, వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహించాలని ఆదేశించారు.



# నూతన సంవత్సరం- 2025 క్యాలెండర్ ఆవిష్కరణ

**పరకాల, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరకాల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు సిఎస్ఐ ఏరియాలో మంగళవారం ఉదయం 10:00 గంటలకు పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు "మడికొండ బ్రదర్స్" వారి నేతృత్వంలో ప్రత్యేకంగా రూపొందించబడిన 2025–నూతన సంవత్సరం క్యాలెండరును ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పరకాల పట్టణ, మండలం, నియోజకవర్గ ప్రజలకు, వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజానీకానికి నూతన సంవత్సర–2025, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపినారు. ప్రతిఒక్కరూ సుఖ: సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆ భగవంతుని వేడుకుంటున్నట్టు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎంపీపీ ఒంటెరు రామూర్తి, స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, ఎన్ ఎస్ యు ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి, డా. బిఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత 2018, డాక్టర్. మడికొండ శ్రీను, పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శివ, బొచ్చు భాస్కర్, బొచ్చు రవి, బొచ్చు జితేందర్, కందుకూరి విద్యాసాగర్, మంద సురేష్, RMP దుప్పటి బాబురావు, ఒంటెరు వరుణ్, బొచ్చు సంపత్, మద్దెల భద్రయ్య, ఒంటెరు సాగర్, మడికొండ ప్రవీణ్, మడికొండ నవీన్, మంద ఆనంద్, మరుపట్ల మహేష్, ఒంటెరు మొగిలి, రవి, బ్యాంకు సుధాకర్, బొచ్చు విష్ణు, బొచ్చు కిషన్, మడికొండ రాజు, బొచ్చు నాగరాజు, చేరిపెల్లి సతీష్, ఒంటెరు కిషోర్, నాగెల్లి ముత్తయ్య, సంగి పున్నం, ఒంటెరు సమ్మయ్య, మహిళలు నాగెల్లి సరోజన, మడికొండ ఓదెమ్మ, ఒంటెరు రజిత, ఒంటెరు మరియమ్మ, చుక్క భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**బయ్యారం/గార్ల/డోర్నకల్, డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం,గార్ల, డోర్నకల్ మండలాలలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిఎసిఎస్,ఐకెపి ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది రికార్డులను పరిశీలించి ధాన్యం కొనుగోలు బస్తాల నిలువలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పంచాయతీల పరిధిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు రెండు,మూడు నిర్వహించడం పై కలెక్టర్ అక్కడ నిర్వాహకులను మందలించినట్లు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఒకే చోట నిర్వహించాలని రైతులకు ఇష్టమున్నచోట కేంద్రాలు పెట్టి ధాన్యం నిలువ చేయరాదని సూచించారు. సెంటర్లో గన్నీ బస్తాలు నిలువలు ఎక్కడ అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, ధాన్యం ఎప్పటికప్పుడు మాచ్చర్ 16,17 శాతం వచ్చిన వాటిని గుర్తించి కాంటాలు నిర్వహించి, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దాన్యం లారీల ద్వారా మిల్లర్లకు తరలించాలని తాహశీల్దార్లను, కొనుగోలు నిర్వహకులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పిఎసిఎస్ చైర్మన్లు,అగ్రికల్చర్ ఆఫీసర్లు, కలెక్టర్ పిఆర్ ఓ అశోక్ , కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులు తదితరులు ఉన్నారు.

# ఐ.ఎన్.టి.యు.సి (ఆటో యూనియన్) ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

**బయ్యారం,డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలో కొత్త పేట గ్రామపంచాయితీ, గంధంపల్లి ఐ.ఎన్.టి.యు.సి (ఆటో యూనియన్)ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలలో కేక్ కటింగ్ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ పాల్గొని, ఐ.ఎన్.టి.యు.సి మండల అధ్యక్షుడు బొమ్మ కంటి రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చెసి అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటో డ్రైవర్లు సురబాక వెంకన్న, ఇమ్మడి రాము, నీలం సాయి, ప్రశాంత్, కొమ్ము శీను, కారంపూడి రాజు, కొండ సంతోష్, మాచర్ల శీను, మూతి కృష్ణ, ఇస్లావత్ రవి, శ్రీధర్, దుర్గా ప్రసాద్, రంగు సంతు, ఊళ్లోజు వీరేష్, భాస్కర్, సాయి కృష్ణ, చీమల కృష్ణ, కోటేష్, సిసింద్రీ, రవి, మెరుగు మల్ల శివ, బొమ్మగంటి సంతు తదితరులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ

**● జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, బయ్యారం,గార్ల,డోర్నకల్, మండలంలోని పలు గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల నిర్వహించాలని అన్నారు, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాల రిజిస్టర్ లను తనిఖీ చేశారు.ధాన్యానికి సంబంధించి వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మ్యాచర్ ఏ విధంగా ఉంది అని చెక్ చేశారు. సెంటర్కు కేటాయించిన రైస్ మిల్లులకు ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తూ రైస్ మిల్లులకు వేగవంతంగా త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగే లా చూడాలని, కొనుగోలు ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, డా. కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో నూతన సంవత్సరం సుఖశాంతులు నింపాలన్నారు. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. గతాన్ని సమీక్షించుకుని బంగారు భవిష్యత్తు నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి ఇంటా సంతోషాలు వెల్లి విరియాలని, ప్రతి ఒక్కరూ ఆనందకరమైన జీవితం గడపాలని కోరుకుంటు న్నానన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత నూతన లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా మరోసారి రాష్ట్ర, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు

# పాలకుర్తిలోని మండలాల కార్యకర్తలు సభ్యులు నాయకులు కేకులను కట్ చేసి సంబరాలు జరుపుకోవద్దని సూచన

**● పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 31(పిసిడబ్ల్యు న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గంలోని మండల పార్టీ కార్యాలయాలు, గ్రామ పార్టీ కార్యాలయాలు, మరియు ఇతర సంబంధిత కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కటింగ్, ఆహ్లాదకరమైన కార్యక్రమాలు నిర్వహించరాదు.ఇది డాక్టర్ మన్మోహన్ సింగ్ గౌరవ సూచకంగా పాటించాల్సిన బాధ్యత అని ప్రజలను, కార్యకర్తలను మరియు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి కోరారు.ప్రతీ కార్యాలయంలో ఒక నిమిష నిశ్శబ్దం పాటించి ఆయనకు ఘన నివాళి అర్పించాలి అని కోరారు.ప్రజలందరూ ఆయన సేవలను గుర్తించుకుని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు చేయాలి అని పిలుపునిచ్చారు..



# ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మహబుబాబాద్ జిల్లా, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రములోని ప్రజా సంఘాల కార్యలయంలో "ఎస్ ఎఫ్ ఐ" 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు స్వాతంత్ర్య, ప్రజాస్వామ్యం,సోషలిజం జెండాను ఆవిష్కరించారు..ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు సూర్య ప్రకాశ్,జ్యోతిబసు జిల్లా నాయకులు సంజయ్, మహష్,వరుణ్,వినయ్ ,ప్రణయ్ పాల్గొన్నారు.

# పాలకుర్తి నియోజకవర్గం ప్రజలందరికీ (ఇంగ్లీష్) నూతన సంవత్సర శుభాకాంక్షలు




**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 31(పిసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు 2024 వ సంవత్సరం వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి. 2025 సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాం.

# కరీంనగర్ సిటీలో పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్...



**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా నగరంలో పరిశుద్ధ పనులను మరింత మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. నగరంలోని 5, 27 వ డివిజన్లలో పరిశుద్ధ అధికారులతో కలిసి పర్యటించారు. హుస్సేనీ పుర ప్రాంతంలో పలు కాలనీలలో పాదయాత్ర చేసి రోడ్లను, ఓపెన్ డ్రైనేజీలను తనిఖీ చేసి పారిశుధ్య పనులను పరిశీలించారు.

# గుండారం గ్రామంలో ఉరివేసుకొని ఒక వ్యక్తి ఆత్మహత్య



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(పీసీడబ్ల్యూ న్యూస్):** బెజ్జంకి మండలం గుండారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి మల్లేశం వయసు 55 సంవత్సరాలు. ఇతనికి భార్య, ముగ్గురు కుమారులు. ఇతడు గత కొంతకాలంగా పచ్చకామర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. మరియు తాగుడుకు బానిస అయినాడు. నిన్న మల్లేశం భార్య భాగ్యలక్ష్మి కూలీ పనికి వెళ్లగా మల్లేశం ఇంటి వద్దనే ఉన్నాడు. నిన్న భాగ్యలక్ష్మి కూలి పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో దూలానికి ఉరివేసుకొని చనిపోయినాడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉరివేసుకొని చనిపోయినట్లుగా అతని కుమారుడైన సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బెజ్జంకి పోలీసులు కరీంనగర్ సివిల్ హాస్పిటల్ లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.





## అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు నరసింహుని ముక్కోటి ఏకాదశి ఆహ్వాన పత్రిక

**వెల్గటూర్, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి దేవాలయంలో ఈ నెల 10వ తేదిన ముక్కోటి ఏకాదశి మహోత్సవానికి ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమారును మంగళవారం క్యాంపు కార్యాలయములో ఆలయ ఈ.వో శ్రీనివాస్ మరియు అర్చకులు ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. టేబుల్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.లక్ష్మణ్ కుమార్ ను స్వామివారికి తీర్థ ప్రసాదాలన్నించి ఆశీర్వదించారు.

## గోదావరిఖనిలో పట్టపగలే కత్తిపోట్ల కలకలం...



**గోదావరిఖని, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కంప్యూటర్ సెంటర్ లో పని చేసే నంది శ్రీనివాస్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశారు. దీంతో కత్తిపోట్లకు గురైన శ్రీనివాస్ తీవ్ర రక్తస్రావంతో కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## పాశిగామాలో పౌరహక్కుల దినోత్సవ సమావేశం

● ఆర్ఐ రాజేశ్వరి



**వెల్గటూర్, డిసెంబర్ 31 (పిసీడబ్ల్యూ.న్యూస్ ప్రతినిధి):** వెల్గటూర్ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాశిగామ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం షెడ్యూల్ కులాల వాడలో పౌర హక్కుల దినోత్సవ సమావేశం ఆర్ ఐ రాజేశ్వరి ఆర్ఐ రామ్ రెడ్డి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కలెక్టర్ అధికారిక ఆదేశాల మేరకు షెడ్యూల్ కులములు, తెగల వారిపై అంటరానితనం నిర్మూలనకై మండల స్థాయి అధికారులు అందరు ప్రతి మాసము చివరి రోజున నిర్దేశించిన గ్రామమును సందర్శించాల్సి ఉంటుంది అని పౌర హక్కుల గురించి గ్రామస్తులకు అవగాహన కలిగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమములో పంచాయతీ సెక్రెటరీ కృష్ణారెడ్డి ఏ.ఎస్.ఐ. శ్రీనివాస్ పిసి అత్తిలి గ్రామస్తులు పాల్గొన్నారు.

## పైడిమడుగు వాగు నుండి ఇసుక రవాణాకు అనుమతి ప్రారంభం



**కోరుట్ల,డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** 30 డిసెంబర్ 2024, నుండి కోరుట్ల మండలం పైడిమడుగు వాగు నుండి అనుమతి పొందిన ఇసుక రవాణా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోరుట్ల తహసిల్దార్ ఇట్యాల కిషన్ మాట్లాడుతూ – ఇసుక రవాణా చేయాలనుకునే ట్రాక్టర్ యజమానులు వారి సరి అయిన వాహన పత్రములు, డ్రైవర్ లైసెన్స్ వివరాలు తహసిల్దార్ ఆఫీసు లో సమర్పించి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్ కి 800 రూపాయలు డిడి చెల్లించినచో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు ఇసుక రవాణా కి అనుమతి ఇవ్వబడునని ఆయన తెలిపారు. ఈ రవాణా సెలవు దినములలో ఉండదు అని కేవలం ప్రభుత్వ పని దినములలో మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు. అనుమతి లేకుండా ఆక్రమంగా రవాణా చేసినా, రాత్రి సమయాల్లో చేసినా సంబంధిత వాహనాలపై క్రిమినల్ కేసులు బుక్ చేసి జప్తు చేయబడుతాయని ఆయన పేర్కొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసుల విస్తృతంగా తనిఖీలు...





**రాజన్న సిరిసిల్ల జిల్లా, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** న్యూ ఇయర్ వేడుకలపై రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. గత రాత్రి నుంచే స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీలు నిర్వహిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడలో నిరంతరాయంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని ప్రత్యక్షంగా వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు. పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేస్తూ మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే చర్యలు తప్ప వని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, డిజే సౌండ్ లు నిషేధించారు. నిబంధన విరుద్ధంగా వ్యవహరిస్తే కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

## రక్తం నిల్వ ఉంటే అత్యవసర పరిస్థితులలో ఉపయోగం

● యువత రక్తదానం చేయాలి ● రక్తదానం చేసిన డాక్టర్ గురువారెడ్డి



**వెల్గటూర్, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ.న్యూస్ ప్రతినిధి):** జగిత్యాల ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరానికి హాజరై న రాష్ట్ర ఐ.ఎం.ఏ ఉపాధ్యక్షుడు ప్రముఖ వైద్యులు డి.గురువారెడ్డి మంగళవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తం ఎంత కీలకమో వైద్యునిగా ప్రత్యక్షంగా చూసిన కాబట్టి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆయన ప్రజలను కోరారు. రక్తం నిల్వ ఉంటే అత్యవసర పరిస్థితులలో చాలా మందికి ఉపయోగపడుతుంది అని ఆయన అన్నారు. ఒక వ్యక్తి సంవత్సరానికి రెండుసార్లు కూడా ఇవ్వచ్చని ఇలాంటి ఇబ్బందులు ఉండవని ఆరోగ్యంగా ఉంటామని ఆయన తెలిపారు.మీ దగ్గరలో జరిగే రక్తదాన శిబిరాలకు మీరు మీ స్నేహితులను మీ బంధువులకు అవగాహన కలిగిస్తూ రక్తదానం చేసే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని అని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చిలుక్కోయలపాడు ప్రజలకు గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

● గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ ఊడుగుల వెంకన్న



**మహబూబాబాద్/సిరోల్,31(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చిలుక్కోయలపాడు గ్రామ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు శ్రేయోభిలాషులకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ గత సంవత్సర కాలం పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషితో దిగ్విజయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి, ప్రభుత్వం ప్రజాపరిపాలన సాగుతోంది , ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి పనులతో పాటు రైతు సంక్షేమం తో సుపరిపాలన అందిస్తున్న శుభ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఊడుగుల వెంకన్న గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2025 సంవత్సరకాలం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నాను అని ఒక ప్రకటనలో తెలిపారు.

## శబరిమల యాత్ర చేసే36 అయ్యప్ప స్వాములకు ఇరుముడి పూజా సామాగ్రి దుప్పట్లు పంపిణీ

● జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గండ శ్రీకాంత్ రావు



**వెల్గటూర్, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ లో గల అయ్యప్పస్వామి దీక్ష స్వాములు జనవరి 2న శబరిమల యాత్ర చేస్తున్న దృష్ట్యా జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గండ్ర శ్రీకాంత్ రావు మంగళవారం ఇరుముడికి సంబందించిన దుప్పట్లు, టవల్, ఇరుముడికి సంబంధించిన పూజా ద్రవ్యాలను 36 మంది స్వాములకు తన గృహం వద్ద మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలనుండి ఇరుముడి పూజ సామాగ్రిని అందిస్తున్న విషయం తెలిసిందే శబరి యాత్ర సందర్భంగా స్వామి వారి దర్శనానికి వెళ్లే వారికి సహకరించడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమములో గురుస్వాములు పెద్ది శ్రీనివాస్ స్వామి, తిప్పర్తి చంద్రమౌళి స్వామి, రమణ మేస్త్రి స్వామి, రామస్వామి, లంకోజుల నరేష్ స్వామి,సిరంగి సంతోష్ కుమార్ స్వామి, గాజుల సతీష్ స్వామి, పులి లక్ష్మణ్ స్వామి,నరేష్, రామస్వామి, రంజిత్ రావు, రమణ మేస్త్రి, రాజేందర్, భరత్ మరియు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## ఎల్ఎండి నుంచి దిగువ ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి...





**కరీంనగర్, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ సమీపంలోని లోయర్ మానే డ్యాం నుంచి దిగువ ఆయకట్టుకు సాగునీటిని కలెక్టర్ పమేలా సత్పతి విడుదల చేశారు. కాకతీయ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద కలెక్టర్ తోపాటు ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి 4000 వేల క్యూసెక్కుల నీటిని కాలువకు వదిలారు చేశారు. వారబందీ పద్ధతిలో ఏడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. స్టేజ్ వన్ కి ఏడు రోజులు, స్టేజ్ 2 కి 7 రోజులు నీటి విడుదల చేయడం జరుగుతుందన్నారు. స్టేజ్ 2 కి మొదటి దఫా నీటిని విడుదల చేసినట్లు అధికారులు ప్రకటించారు. మార్చి 31 వరకు మాత్రమే సాగునీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు తెలంగాణ ప్రజల పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన పాలకుర్తి ఎమ్మెల్యే



**తొర్రూర్ ప్రతినిధి, డిసెంబర్ 31(పీసీడబ్ల్యు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రజాప్రతిని అందరికీ తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రేక్ దర్శనం (తిరుమల శ్రీవారి దర్శనంలో ప్రాధాన్యత కలిగిన ప్రత్యేక దర్శనం) కల్పించేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞాపన చేయగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్ విఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ నిర్ణయం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల (శాసనసభ్యులు,శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు) లేఖల ఆధారంగా వారికి తిరుమల బ్రేక్ దర్శనం కోసం అనుమతి అందించబడుతుందని అన్నారు. ఈ సౌకర్యం ప్రజా ప్రతినిధులకు శ్రీవారి సేవలతో పాటు వారి భక్తి నిష్టను అభివృద్ధి పరచటానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రికి మరియు టీటీడీ చైర్మన్ వారికి పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ రెండు రాష్ట్రాల మధ్య సానుకూల సంబంధాలకు ప్రజాప్రతి నిధులకు కల్పిస్తున్న సౌకర్యాలకు అలాగే భక్తుల విశ్వాసానికి నిదర్శనం అని పేర్కొన్నారు. శ్రీ వెంకటే శ్వర స్వామి వారిని దర్శించుకోవడంలో ఎలాంటి సమస్యలు లేకుండా ఈ సౌకర్యాన్ని అందించడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యొక్క ఉన్నతమైన నిబద్ధతకు సాంకేతంగా నిలుస్తుందని పేర్కొన్నారు

# ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు చార్టర్ ప్రెసిడెంట్ పిడిజి లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తొర్రూరు ప్రతినిధి,డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం లోని చర్లపాలెం గ్రామానికి చెందిన జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదినం వేడుకల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చార్టర్ ప్రెసిడెంట్, పి డి జి, చీఫ్అడ్వైజర్ లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా అధ్యక్షులు లయన్ నవీన్ కుమార్ అధ్యక్షతన ఉదయం 6 గంటలకు స్థానిక యతి రాజారావు పార్కులో బిపి షుగర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించ నైనది.80 మందికి స్క్రీనింగ్ నిర్వహించి తగు జాగ్రత్తలు సూచనలు చేయనైనది9 గంటలకు రాజేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలపనైనది.9:30 నిమిషాలకు స్థానిక విశ్రాంతి భవనంలో జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.దీనికి ముఖ్యఅతిథిగా సీఐ జగదీష్ విశిష్ట అతిథిగా పి డి జి లయన్ లక్ష్మీనరసింహారావు అతిథులుగా లయన్ డాక్టర్ కిరణ్ కుమార్ ఎడిసిఎస్, లయన్ రేగురి వెంకన్న ఎడిసిఎస్ మరియు లయన్ మిత్రుల హాజరైనారు 20 యూనిట్ల రక్తాన్ని మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ వారికి అందజేశారు. 11 గంటలకు మైనారిటీ విద్యార్థులకు ఒక క్వింటాల్ బియ్యాన్ని రాజేందర్ రెడ్డి ఆర్థిక సహాయంతో అందించడమైనది.11:30 నిమిషాలకు కుమ్మరి కుంట్ల పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మరియు విద్యార్థులకు పెన్నులు



లయన్ కోనే ప్రభాకర్ ఆర్థిక సహాయం చే పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ కొరకు 5000 రూపాయలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పి డి జి లయన్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బాగా ఇష్టపడి చదువుకొని ఉత్తీర్ణత సాధించాలని మంచి జ్ఞానాన్ని పొందాలని మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కోసం నిరంతరం శ్రమించాలని కోరినారు పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించినారు,మధ్యాహ్నం 3 గంటలకు జెడ్పిహెచ్ఎస్ గుర్తూరు పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు.స్థానిక రిక్షా కాలనీలోని మహిళలకు 30 చీరలను పంపిణీ చేశారు.6 గంటలకు స్థానిక వందేమాతరం ఫౌండేషన్ లోని విద్యార్థులకు బియ్యము, నూనె, నిత్యవసర సరుకులు



అందించి వారిని దీవించారు.విద్యార్థులందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లయన్ రమేష్ కోశాధికారి లయన్ శంకర్ లయన్ శారద లయన్ డాక్టర్ నాగవాణి లయన్ ఏ వెంకటరెడ్డి లయన్ కోనే ప్రభాకర్ లయన్ ప్రతాపని వెంకటేశ్వర్లు లయన్ డాక్టర్ రామ నరసయ్య లయన్ సారధి వెంకటేశ్వర్లు లయన్ దామెర సురేష్ లయన్ మాదారపు వేణుగోపాల్ లయన్ విజయ్ పాల్ రెడ్డి లయన్ నల్లా కృష్ణమూర్తి లయన్ రవీందర్ రెడ్డి లయన్ ప్రవీణ్ రాజు లయన్ తాళ్లపల్లి రమేష్ లయన్ గుండాల నరసయ్య లయన్ వెంకటేశ్వర్ రెడ్డి,లయన్ వేముల రమేష్ లయన్ సోమ రాజశేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదలగువారు పాల్గొన్నారు.

## పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి




**తొర్రూరు ప్రతినిధి, డిసెంబర్ 31(పీసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం లోని అన్ని మండలాల ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు,మిత్రులకు,శ్రేయోభిలాషులకు 2025 నూతన సంవత్సరం కొత్త ఆనందాన్ని, కొత్త లక్ష్యాలను, కొత్త విజయాలను మీకు మీ కుటుంబ సభ్యులకు అందించాలని కోరుతున్నాం. 2024వ సంవత్సరం వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేస్తున్నాం పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి.

## హౌసింగ్ బోర్డ్ కాలనీ ఓపెన్ జిమ్ ఆధ్వర్యంలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు





**కరీంనగర్, డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల ఓపెన్ జిమ్ మిత్రుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముందస్తుగా న్యూ ఇయర్ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఓపెన్ పరిసర ప్రాంతాన్ని అందంగా బెలూన్ లతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన న్యూ ఇయర్ కేకును 7వ డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ నేత ఆకుల పద్మ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన సంవత్సర కేకును కోశారు. ఓపెన్ జూన్ మిత్రులందరికీ ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఓపెన్ మిత్రులు కొత్త సంవత్సరంలో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ఓపెన్ కి మిత్రుల పిల్లలందరూ విద్యారంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు . అనంతరం మహిళలు, చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో.. జిమ్ ట్రైలర్ షాకీర్ నహిది బొబ్బల రవీందర్ రెడ్డి ఆకుల సుదర్శన్ ఇంద్రసేనారెడ్డి శంకరయ్య రాజిరెడ్డి రజనీకాంత్ లక్ష్మణ్ మహమ్మద్ రఫీ తదితర ఓపెన్ జిమ్ మిత్ర బృందం పాల్గొన్నారు.ం



**పిసిడబ్ల్యూ న్యూస్ యాజమాన్యానికి, సీఈవో, ఎడిటర్, సిబ్బందికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మరియు మంచిర్యాల జిల్లా, కాసిపేట మండలం, లోని అన్ని గ్రామ పంచాయతీల ప్రజలకు, పాఠకులకు, ఓరియంట్ సిమెంట్ యాజమాన్యానికి, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం లోని అన్ని మండలాల పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,2025 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పిసిడబ్ల్యూ న్యూస్ తెలంగాణ కోఆర్డినేటర్ మనోహర స్వామి.**

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెయింటింగ్ సంఘం జేఏసీ చైర్మన్‌గా ఆనంద్



**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల జేఏసీ చైర్మన్ గా ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల జేఏసీ నూతన కార్యవర్గం సమావేశాన్ని కరీంనగర్ పట్టణంలోని సర్కస్ గ్రౌండ్ లో నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు హుస్నాబాద్ జోన్ల నుంచి సమావేశానికి హాజరైన బిల్డింగ్ పెయింటర్స్ ఆమోదంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటయింది. జేసి చైర్మన్ గా చాడ ఆనంద్, అధ్యక్షుడిగా ప్రభాకర్ ను ఎన్నుకున్నారు.

# వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట, డిసెంబర్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర తొలి అక్షరం తెలుగు దినపత్రిక పాఠకులకు,వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు,యువతీ యువకులకు, ఉద్యోగులకు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలియజేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ....పాత వ్యసనాలను విడిచిపెట్టి నూతన ఆశయాలు లక్ష్యాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలనీ అన్నారు.అప్పుడే జీవితంలో వెలుగులు పూస్తాయనీ అన్నారు.ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సంతోషమైన జీవితం వేరు అర్థవంతమైన జీవితం వేరు అని అన్నారు.క్షణికమైన సంతోషం కోసం అర్థవంతమైన జీవితాన్ని ఆగం చేసుకోవద్దనీ సూచించారు.క్షణికమైన సంతోషం కోసం డ్రగ్స్ బారిన పడకండి అని హెచ్చరించారు. దుర్మార్గమైన డ్రగ్స్ ను ధ్వంసం చేద్దాం ఆరోగ్య తెలంగాణ ను నిర్మించుకుందాం అని పిలుపునిచ్చారు.విలువలతో కూడుకున్న జీవిత లక్ష్యంతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలని మీ అన్నగా, తమ్ముడిగా మనసారా కోరుకుంటున్నాను అని అభిప్రాయపడ్డారు.మద్యం సేవించి వాహనాలు నడపకండి అని కోరారు.వేగంతో ప్రయాణాలు చేసి ప్రమాదాలను కొని తెచ్చుకోకండి అని అన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ రాష్ట్రం కోసం అందరం ప్రతిన భూనుదాం అని అన్నారు.



## నూతన సంవత్సర వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల, డిసెంబర్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఎస్పీ అశోక్ వీలైనంతవరకు ఇండ్లలోనే సెలబ్రేషన్ చేసుకోవాలని డ్రంక్ అండ్ డ్రైవ్ రాష్ డ్రైవింగ్ వంటివి చేయకూడదని హెచ్చరించారు.ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలుజరిగేందుకు వెహికల్ చెకింగ్ తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని అన్నారు.జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని కోరారు.




# కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయండి

- కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి బీఎంఎస్ నాయకుల విజ్ఞప్తి

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లో ఈఏస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి విజ్ఞప్తి చేశారు . ఈ మేరకు సోమవారం రోజున కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో బిఎంఎస్ నేతలు మంత్రి బండి సంజయ్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ లో వేల మంది కార్మికులు, ఈఎస్ఐ కార్డుదారులు ఉన్నారని, ఆసుపత్రి ఏర్పాటు తో కార్మికులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో కి వస్తాయని, ఇది కార్మికులకు ఎంతో ప్రయోజనకారంగా ఉంటుందని వివరించారు. తక్షణం కరీంనగర్లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బి ఎం ఎస్ నేతలు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమం లో బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, నక్క అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

